సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 6 | ఫిబ్రవరి | 2024



భక్తులకు మెరుగైన సౌకర్యాలు
మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు.
- 8లో▸



భవ్య కుటుంబీకుల రాస్తారోకో
భవ్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుధరావుపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం
ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య పి.వరలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా వరలక్ష్మిని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఇతర సభ్యులు శాలువాతో సన్మానించి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు సూరాజ్‌కృష్ణ, చందు, శ్రీను, మహేందర్, సంపత్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు పాంచజన్య



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎల్లాపూర్‌లోని మాంటిస్సోరి స్కూల్ విద్యార్థి పి.పాంచజన్య ఎంపికైనట్లు కోచ్ సిరిగిరి తిరుపతి తెలిపారు. 54 కేజీల పాయింట్ ఫైటింగ్, కిక్‌లైట్ క్రియేటివిటీ పార మ్స్ విభాగాల్లో పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థిని స్కూల్ చైర్మన్ సీస్ జోస్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి తదితరులు అభినందనలు తెలిపారు.

'కానిస్టేబుళ్ల'కు ఫిట్‌నెస్ పరీక్ష



ఎంజీఎం: కలెక్టర్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ నియామక అభ్యర్థులకు ఎంజీఎం, రీజినల్ కంటి ఆస్పత్రుల్లో ఫిట్‌నెస్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. ఫిట్‌నెస్ ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో చర్చించి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

జోరుగా రిజిస్ట్రేషన్లు



కాజీపేట అర్బన్: వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. భూ క్రయ, విక్రయదారులు వరంగల్ ఆర్వోకు పోటెత్తారు. శుక్ర, శనివారాల్లో సుమారు 50 నుంచి 60 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి కాగా, సోమవారం 110 దస్తావేజులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఖజానాకు రూ.80లక్షల ఆదాయం సమకూరింది. సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్లను సబ్ రిజిస్ట్రార్లు పూర్తి చేశారు.

7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8వ తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్-15, 20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 11 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

'పది' విద్యార్థులకు స్పెషల్ టెస్టు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఆయా యాజమాన్యాల పరిధిలో గల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి స్పెషల్ టెస్టులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్(తెలుగు,ఉర్దూ, హిందీ) సబ్జెక్టు పేపర్ల పరీక్షలు నిర్వహించారు. ఈనెల 12వతేదీ వరకు ఈపరీక్షలు కొనసాగనున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

నిధులు కరువు.. సేవకు సెలవు!

ఎన్‌ఎస్‌ఎస్‌కు నిధుల పెంపు.. విడుదలలో జాప్యం

- మొత్తం రావాల్సిన నిధులు రూ. 2.67 కోట్లు
- విడుదలైనవి రూ.47 లక్షలు
- కానరాని ప్రత్యేక శిబిరాలు
- పీఎఫ్‌ఎంఎస్ అకౌంట్లు తీసినా నిధుల వినియోగానికి ఇబ్బందులే



కేయూలో కేడీసీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (ఫైల్)

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) సామాజిక సేవల్లో ముందుండేది. రాష్ట్రపతి చేతుల మీదుగా కూడా అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిధులు విడుదలవ్వక సేవలు అంతంతమాత్రంగానే అందించే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రం విడుదల చేసే నిధుల వినియోగంలో అనేక ఆంక్షలుండడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు ముందడుగు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల పెంపు..

కేయూ పరిధిలో ఎన్‌ఎస్‌ఎస్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో కలిపి మొత్తం 356 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100మంది చొప్పున మొత్తం 35,600లమంది వలంటీర్లున్నారు. వీరు స్వచ్ఛ భారత్, రక్తదానం, ప్రజల్లో చైతన్యం కలిగించే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వీటి నిర్వహణ సందర్భంగా వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాలకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు వెచ్చిస్తారు. గతంలో ఒక్కో యూనిట్‌కు రెగ్యులర్ కార్యక్రమాలకు రూ.16 వేలు ఉండేది. ఇప్పుడు రూ 27,500లకు పెంచారు. అదే విధంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌చే వారం రోజులు ఏదైనా గ్రామంలో 50 మంది వలంటీర్లతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తే గతంలో 22,500లు ఇచ్చేవారు. దాన్ని రూ.35 వేలకు పెంచారు.

కొత్తగా పీఎఫ్‌ఎంఎస్ అకౌంట్లు

ఎన్‌ఎస్‌ఎస్‌కు విడుదల చేసే నిధులను జవాబుదారీతనంగా వెచ్చించేలా కేంద్ర ప్రభుత్వం 'మై భారత్ పోర్టల్'ను తీసుకొచ్చింది. ఆతర్వాత కొత్త పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్‌ఎంఎస్) ద్వారా బ్యాంకుల్లో ప్రతీ కళాశాలకు సంబంధించిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఖాతాలను ఓపెన్ చేయాలనడంతో ఎక్కువ శాతం కాలేజీలు ఓపెన్ చేశాయి. కొన్ని కళాశాలలు ఇంకా పీఎఫ్‌ఎంఎస్ అకౌంట్లు కూడా తీయలేదు.

నిధులు ఖర్చు చేయాలంటే ఇబ్బందులే..

గతంలో వర్సిటీ అధికారులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి రెగ్యులర్ కార్యక్రమాల నిర్వహణకు నిధులు విడుదల చేసేవారు. పీఎఫ్‌ఎంఎస్ అకౌంట్, నిబంధనలు, పలు ఆంక్షలతో నిధులను వినియోగించుకోలేకపోతున్నారు. ఈనిధుల వినియోగానికి సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతి ఉండాలి. ఇదంతా ఒక ఎత్తయితే పలు సాంకేతిక సమస్యలూ తలెత్తుతున్నాయని కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత నెల 29న వరంగల్ కేంద్రంగా, 30న ఖమ్మం జిల్లాలో, 31న ఆదిలాబాద్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదని ప్రోగ్రాం ఆఫీసర్లు వాపోతున్నారు.

రెమ్యూనరేషన్ ఏది?

కేయూ పరిధిలో 356 మంది ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండేళ్ల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెమ్యూనరేషన్ విడుదల కాలేదు. గతంలో వీరికి ఒక్కొక్కరికి రూ.6వేలు ఉండగా.. రూ. 8,500లకు పెంచారు. కానీ విడుదల చేయడం లేదు. దీంతో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలపట్ల వారు కూడా విముఖత చూపుతున్నారు. నూతన విధానంతో అనేక ఇబ్బందులతో రాబోయేకాలంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశం కూడా ఉంది.

రూ.47 లక్షల నిధులే విడుదల

కేయూ పరిధిలో ఎన్‌ఎస్‌ఎస్‌కు గత విద్యాసంవత్సరంలో నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరం రూ.2.67 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉండగా.. రూ.47 లక్షలు విడుదలయ్యాయి. వచ్చిన రూ. 47 లక్షల్లో దీంతో గత కొద్దిరోజుల క్రితం నిధులు తక్కువగా ఉండటంతో కేవలం 171 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ 27,500ల చొప్పున నిధులు ఆయా కళాశాలల యూనిట్లకు అధికారులు విడుదల చేశారు. ఆ నిధులన్నీ రెగ్యులర్ కార్యక్రమాలకే వెచ్చించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువగా ఉండే కళాశాలల్లో నాలుగైదు యూనిట్లు కూడా ఉంటాయి. కళాశాలలో ఎన్ని యూనిట్లు ఉన్నా.. ఒక్క యూనిట్‌కు మాత్రమే రూ 27,500ల చొప్పున వేశారు. గతంలో ప్రత్యేక శిబిరాల నిర్వహణ అనంతరం బిల్లులు పెట్టుకుంటే వర్సిటీ అధికారులు చెల్లించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో శిబిరాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఈసారి ఎన్‌ఎస్‌ఎస్ యువజనోత్సవాలు కూడా జరగలేదు.

తక్కువ నిధులు విడుదలయ్యాయి..



కేయూ పరిధి 356 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉండగా.. రూ.2.67 కోట్లు రావాల్సి ఉంది. కానీ రూ.47 లక్షల నిధులే విడుదలయ్యాయి. అందులో 171 యూనిట్లకు విడుదల చేశాం. అయితే ఆనిధులను వినియోగంపై అవగాహన కల్పించాం. ఈనిధులు పూర్తిగా వినియోగిస్తే మరోసారి విడుదలయ్యే అవకాశం ఉంది. నిధుల కొరత ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలపై ప్రభావం చూపుతోంది.

– ఆచార్య ఈసం నారాయణ, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్

'గృహజ్యోతి'కి డిస్కం సన్నద్ధం

- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేటి నుంచి తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నమోదు



జిల్లాల వారీగా గృహ వినియోగదారులు

జిల్లా	వినియోగదారులు
హనుమకొండ	3,45,302
వరంగల్	2,86,156
భూపాలపల్లి, ములుగు	1,93,257
జనగామ	1,69,375
మహబూబాబాద్	2,09,066

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈపథకం కింద గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు అమల్లోకి వచ్చాయి. ఇటీవల మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గృహజ్యోతి పథకం అమలుకు వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ డిస్కంలకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ప్రక్రియ షురూ..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని 16 జిల్లాల్లో 45,64,889 మంది గృహ వినియోగదారులున్నారు. ఈనెల 6 నుంచి బిల్లులు తీస్తున్నప్పుడే మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారులను కలిసి రేషన్ కార్డు, ఆధార్ నంబర్ తీసుకుని నమోదు చేయాలని సూచించారు. ఈమేరకు సిద్ధం చేస్తున్న సాఫ్ట్‌వేర్ మంగళవారం(నేడు) ఉదయానికి అందుబాటులోకి రానుంది. ప్రతి ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం(ఈఆర్‌ఓ)లో ఉదయం 9 గంటలకు స్పాట్ బిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డివిజన్ ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ వినియోగం, మీటర్ రీడింగ్, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల నమోదుపై అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ.. జిల్లా ఎస్‌ఈలు, డీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డివిజన్ల వారీగా సమావేశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికారులు మీటింగ్‌కు రావాలని స్పాట్ బిల్లర్లకు సమాచారం పంపారు. ఇదిలా ఉండగా.. అద్దెకు ఉంటున్న కుటుంబాల ఆధార్, రేషన్ కార్డు నంబర్ నమోదుపై అధికారులు సందేహాలు వ్యక్తం చేయగా నివృత్తి చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్ నంబర్‌తో పాటు వారి రేషన్ కార్డు, ఆధార్‌నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియతో యజమానులకు ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ప్రతి నెలా 15వ తేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీ చేస్తుంది. ఈనెల 15వ తేదీ నాటికి తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులు ఎంత మంది ఉన్నారో స్పష్టంగా తెలుస్తుంది.

పీహెచ్‌సీలో వృద్ధులకు ప్రత్యేక శిబిరం

- ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హసన్‌పర్తి: ప్రతి గురువారం వయో వృద్ధులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరో గ్య కేంద్రాన్ని సోమవారం ట్రైనీ కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో సిబ్బంది వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రతీరోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని, వారికి సరిపడా మందులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.

భవనం శిథిలంగా ఉంది

ఆస్పత్రి భవనం శిథిలంగా ఉందని ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వీపర్ కూడా ఒక్కరే ఉండడంతో శుభ్రత కొరవడిందని చెప్పారు. ఏడాదిగా ఆపరేషన్ థియేటర్ పనిచేయడం లేదని వైద్యులు తెలిపారు. మరుగుదొడ్ల సమస్య ఉన్నట్లు ట్రైనీ కలెక్టర్ గుర్తించారు.



వైద్యులతో మాట్లాడుతున్న శ్రద్ధా శుక్లా

వినయ్ కోసం మా భవిష్యత్‌ను త్యాగం చేశాం

- అయినా ఎలాంటి గుర్తింపు లేదు
- ప్రణయన్న ఆత్మీయుల సమ్మేళనంలో అభినవ్ భాస్కర్

హన్మకొండ చౌరస్తా: 'వినయ్‌భాస్కర్ ఓటమికి నేనే కారణమంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా నాన్న మరణాంతరం కుటుంబం కోసం ఆనాడు నా తల్లి, నేడు నేను భవిష్యత్‌ను త్యాగం చేశాం.. ఇకపై అలా జరగదు.. త్వరలోనే ప్రజల ఆశీస్సులతో భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తా' అని 60వ డివిజన్ కార్పొరేటర్, పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సోదరుడి కుమారుడు దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ, రెడ్డి కాలనీలోని శారదా గార్డెన్‌లో సోమవారం 'ప్రణయన్న ఆత్మీయుల సమ్మేళనం' నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి ప్రణయ్‌భాస్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హాజరైన ప్రజలను ఉద్దేశించి అభినవ్‌భాస్కర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వినయ్‌భాస్కర్ కోసం పనిచేసినా గుర్తింపు లేదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రణయ్ భాస్కర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని హనుమకొండ పట్టణ నడిబొడ్డున, రాజధానిలోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి ప్రణయ్‌భాస్కర్ పేరు పెట్టాలని, ఎవరు ఆపాలనుకున్న ప్రణయ్‌భాస్కర్ ఏకైక వారసుడిగా మీ ముందు నిలబడతానన్నారు. తనను నమ్ముకున్న వారి కోసం సరైన నిర్ణయం తీసుకోకపోతే సమర్థుడిని కాలేకపోతానని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు దర్శన్‌సింగ్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, భిక్షపతి, రావుల సుదర్శన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్

బీజేపీని మరింత పటిష్టం చేద్దాం

- ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

హన్మకొండ: రాష్ట్రంలో బీజేపీని మరింత పటిష్టం చేద్దామని పార్టీ శ్రేణులకు బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి హనుమకొండకు వచ్చిన సందర్భంగా మడికొండ నుంచి హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ వరకు ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కన్వెన్షన్‌లో కొండేటి శ్రీధర్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీశ్ షా, చీటూరి అశోక్, బన్న ప్రభాకర్, వన్నాల వెంకటరమణ, కనుకుంట్ల రంజిత్, నాంపల్లి యకయ్య, కుడికాల శ్రీధర్, జన్ను మధుకర్ పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయికులు, కార్యకర్తలు

మార్కెట్‌ను సందర్శించిన డైరెక్టర్

వరంగల్: రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సోమవారం ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా అధికారులతో సమావేశమై మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న మిర్చి, పత్తి సరుకు లాట్ ఐడీలు జారీ, లైసెన్సుల బకాయిలు, వసూళ్లు, మార్కెట్ ఫీజుల వసూళ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసున్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు డైరెక్టర్లు లక్ష్మణుడు, శ్రీనివాస్, రవికుమార్, జేడీఎం మల్లేశం, రాజునాయక్, గ్రేడ్-1 కార్యదర్శి సంగయ్య, గ్రేడ్-2 కార్యదర్శులు బియాబానీ, రాము, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీబాయి

ఆలకిస్తూ.. ఆదేశిస్తూ

- వినతులు స్వీకరించిన బల్దియా కమిషనర్
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 81 వినతులు

వరంగల్ అర్బన్: సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన పౌరుల గోడును కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సావధానంగా విన్నారు. సమస్యలకు వెంటనే పరిష్కార మార్గం చూపాలని, సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది లోపం లేకుండా చూసుకోవాలని సీరియస్‌గా హెచ్చరించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఫిర్యాదులు స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 9, హెల్త్-శానిటేషన్ 9, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ)15, టౌన్ ప్లానింగ్ 47, హార్టికల్చర్ 1 మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్‌యాదవ్, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, సెక్రెటరీ విజయ లక్ష్మి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, హెచ్‌ఓ రమేశ్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి

తాగునీరు అందించే చివరి నల్లా కనెక్షన్ వరకు నీటి సరఫరాను పర్యవేక్షించి, సమస్యలు ఉంటే పరిష్కారించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత ఏఈలను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో తాగునీరు, టౌన్ ప్లానింగ్ సమస్యలపై సమీక్షించారు.

స్మార్ట్‌సిటీ పనుల్ని వేగంగా పూర్తి చేయండి

గ్రేటర్ వరంగల్‌లోని స్మార్ట్‌సిటీ పథకం కింద కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం సాయంత్రం వరంగల్ భద్రకాళి బండ్ పనులను కమిషనర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం ఉర్సు రంగనాయిక సముద్రం సుందరీకరణ, వడ్డేపల్లి చెరువు సుందరీకరణ పనులపై సమీక్షించారు. ఇందులో బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు, స్మార్ట్‌సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మీరెందుకున్నట్లు?

గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు, దరఖాస్తుదారుడు పెరుమాండ్ల లక్ష్మణ్‌కు మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. చిన్నవడ్డేపల్లి చెరువుతోపాటు ఇతర చెరువుల్లో గణేశ్ నిమజ్జనం చేసిన విగ్రహాలను తొలగించాలని లక్ష్మణ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చాడు. వాహనాలు మరమ్మతుల్లో ఉన్నాయని, సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లాలని రిజ్వాన్‌బాషా సమాధానమిచ్చారు. 'మేం వారి దృష్టికి తీసుకెళ్తే మీరెందుకు ఉండి' అని లక్ష్మణ్ అనడంతో అధికారులు అవాక్కయ్యారు. అతడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం. ఈవిషయంపై పోలీసులను వివరణ కోరితే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న రాధికగుప్తా

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రాధిక గుప్తా మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పట్ల ఆయా శాఖ అధికారులు అశ్రద్ధ చూపొద్దని, సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ 9, తహసీల్దార్ కాజీపేట 7, ఆర్‌డీఓ 6, డీఆర్‌డీఓ 5లతో పాటు మొత్తం 76 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వై.వి గణేష్, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, డీపీఓ జగదీశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీ





ఈవీఎంలను పరిశీలిస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాంను హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య సోమవారం వేర్వేరుగా తనిఖీ చేశారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ రమేశ్, తహసీల్దార్లు నాగరాజు, బాష్‌సింగ్, జ్యోతి వరలక్ష్మీదేవి, జగన్మోహన్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, నాయబ్ తహసీల్దార్లు సంతోశ్, విఠలేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

విద్యారణ్యపురి: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి తాగు నీరందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

ప్రత్యేక అధికారులు జవాబుదారీతనంతో పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం జిల్లా పరిషత్‌లో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యకలాపాలపై కలెక్టరేట్‌లో ఈజీఎస్, ఏపీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్షించారు.

క్లుప్తంగా

భూన్యాయ శిబిరాలు వాయిదా

పెద్దవంగర: రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూన్యాయ శిబిరాలను వాయిదా వేసినట్లు లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఈ నెల 7,8, బొమ్మకల్లులో 16,17, అలాగే, జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో 12,13 తేదీల్లో నిర్వహించనున్న భూన్యాయ శిబిరాలను మరో తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ తండ్రి సోమవారం కన్నుమూశారు. దీంతో న్యాయ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేతిరెడ్డి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

జువైనల్ హోమ్‌కు బాలుడి అప్పగింత

నెల్లికుదురు: బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సెల్‌ఫోన్‌కు నెల్లికుదురు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నిత్యం అసభ్యకర మెస్సేజీలు పంపుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో బాలిక మృతికి కారణమైన బాలుడిని సోమవారం వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం నర్సింహులపేటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేముల ప్రభాకర్‌రెడ్డి తన భార్యతో కలిసి 15 రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని లాకర్‌లో ఉన్న 8 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు


సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్


ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం జాతర
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- అధికారులతో సమీక్ష సమావేశం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం మేడారంలోని హరితహోటల్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్..అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం.. దేశంలోనే పెద్ద వన జాతరని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 6 వేల ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి ఆర్టీసీ క్యాంప్ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. జాతర సమయంలో సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ఎండీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతరలో ఆర్టీసీ.. ఇప్పటి వరకు లక్షా పదివేల మంది భక్తులకు సేవలు అందించిందని తెలిపారు. 70 వేల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మహాద్భుత ఘట్టం మేడారం జాతరని, భక్తుల సౌకర్యార్థం రూ. 105 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను మంత్రులు పొన్నం, సీతక్క ప్రారంభించారు. అనంతరం వీఐపీ పార్కింగ్ వరకు బస్సులో ప్రయాణించారు.

ఆర్టీసీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

మేడారంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే బస్సులు, పార్కింగ్ స్థలాలు, బస్ షెల్టర్లు, క్యూలైన్ వార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల షెల్టర్లు, తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలువాయిద్యాలతో మంత్రులు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం?

- మృతుడు, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సూసైడ్ నోట్ లభ్యం
- దీని ఆధారంగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి అరెస్టు!
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం/ హసన్‌పర్తి : కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి(35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డి (35) మృతి కేసు పలు మలుపులు తిరిగింది. తన ఆత్మహత్యకు కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి కారణమంటూ భాస్కర్‌రెడ్డి సూసైడ్ నోట్ లభించడం సంచలనంగా మారింది. సూసైడ్ నోట్‌లో చిట్‌ఫండ్ యాజమాన్యం కారణమని ఉండడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు కేయూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కమలాకర్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, రాగిడి తిరుపతిరెడ్డి మోసం కారణంగా భాస్కర్ రెడ్డి మృతి చెందాడని, ఈ ఘటనపై తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకుని కష్టమర్ల డిపాజిట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు జరమని తేల్చి చెప్పడంతో పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. ఈ విషయంపై సుబేదారి సీఐ షూకుర్‌ను వివరణ కోరగా భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సూసైడ్ నోట్ అందజేశారన్నారు. దీంతో ఈ కేసులో సెక్షన్లు మార్పు చేశామన్నారు. భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు యాజమాన్యమే కారణమనే ఆరోపణలపై వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

భవ్య కుటుంబీకుల రాస్తారోకో

- తప్పుడు ప్రచారంపై ఆగ్రహం


రాస్తారోకో చేస్తున్న భవ్య కుటుంబ సభ్యులు

ఖానాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఇరువురు విద్యార్థినులు మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భవ్య మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆటోడ్రైవర్‌తో పాటు వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాస్తారోకో వద్దకు చేరుకుని స్పష్టమైన హామీ ఇవ్వాలని బైఠాయించారు. మృతదేహంతో రోడ్డుపైనే నిలవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేను పిలిపిస్తేనే రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వారిని శిక్షించండి..

'నా కూతురును చంపిన వారిని చంపేయండి.. అన్యాయంగా నా బిడ్డను పొట్టనబెట్టుకున్నారు..నా బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయి..అందరు కలిసి మా కుటుంబానికి అన్యాయం చేస్తాండ్లు.. నా బిడ్డ ఒంటిపై దెబ్బలు ఉన్నాయి. చంపినోళ్లను వదిలేయవద్దంటూ' భవ్య తల్లి లలిత రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. నా బిడ్డను చంపినవారిని వదిలేయొద్దు. వారిని కఠినంగా శిక్షిస్తేనే నా బిడ్డ ఆత్మ శాంతిస్తదంటూ బోరున విలపించారు. కాగా, ఎస్సై మాధవ్‌గౌడ్.. భవ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పూజలు.. మేకపిల్ల బలి
- పెద్దపహాడ్‌లో అర్ధరాత్రి హల్‌చల్..
- రెండు బైక్‌లు వదిలి కారులో పరార్
- 100 డయల్‌కు ఫోన్.. పోలీసుల విచారణ
- అదుపులో ఇద్దరు వ్యక్తులు


తవ్వకాలు చేపట్టిన గుంతలో మేక పిల్ల

జనగామ: జనగామ మండల పరిధి పెద్దపహాడ్ గ్రామం వెంకిర్యాలకు వెళ్లే దారి.. దండు సిద్దులు, కాటబోయిన రాములు వ్యవసాయ బావి వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు మాట్లాడుకుంటున్నారు. రెండు బైక్‌లు, ఓ కారులో అక్కడికు వచ్చిన వ్యక్తులు గతంలో ఉన్న గుంతలో నిమ్మకాయలతో పూజలు చేసి మేక పిల్లను బలిచ్చి అందులో వేశారు. సిద్దులు స్నేహితుడు అదే రోజు రాత్రి వెంకిర్యాలకు వెళ్తుండగా వ్యవసాయ బావి వద్ద కారు, బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో సమీపానికి చేరుకున్నాడు. మనుషుల కదలికలు కనిపించడంతోపాటు పాకలో ఉన్న పశువులు బయటకు వచ్చి అరుస్తుండగా.. సిద్దులుకు గ్రామస్తులకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లు అక్కడే వదిలేసి కారులో పారిపోయినట్లు సిద్దులు తెలిపారు. 100 నంబర్‌కు డయల్ చేయగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే ప్రదేశంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సంఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై సృజన్ మాట్లాడుతూ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేయలేదని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో అడవిలో పూజలు చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తుల ఇళ్లలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు వెల్లడించారు.

కాజీపేట జంక్షన్‌లో అయోధ్య రైలు


కాజీపేటలో అయోధ్య రైలు వద్ద రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్–అయోధ్య వెళ్లే ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6:40 గంటలకు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ రీజన్స్ దృష్ట్యా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేశ్‌కుమార్, కాజీపేట సీఐ సంజీవరావు, కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, రైల్వే అధికారులు, మెకానిక్ సిబ్బంది ప్రత్యేక రైలు వద్దకు చేరుకున్నారు. 6:55 గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా.. ఈ రైలులో కాజీపేట జంక్షన్ నుంచి ఎవరూ ఎక్కలేదని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల ప్రారంభం

కాజీపేట జంక్షన్ నుంచి కాజీపేట–అయోధ్య వరకు మంగళవారం నుంచి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. ఈమేరకు మంగళవారం అయోధ్య రైలును ప్రారంభించి పంపించే ఏర్పాట్లలో ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. 20 బోగిలతో కూడిన ఈప్రత్యేక రైలులో ఉమ్మడి జిల్లా నుంచి 1,300 మంది ప్రయాణికులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. బీజేపీ నాయకులు, అధికారులు అయోధ్య ప్రత్యేక రైలు అధికారికంగా పంపించే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు ప్రయాణికులు వెళ్లనున్నట్లు తెలిపారు. కాజీపేట–అయోధ్య, అయోధ్య–కాజీపేట (07223/07223) మధ్య 30 రైళ్ల సర్వీస్‌లను మార్చి 2వ తేదీ వరకు ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 8 నుంచి అమలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ స్టేషన్ వరకు 16 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 18.00 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు సికింద్రాబాద్–సుబేదార్ గంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం కాజీపేటకు ఉదయం 8.00 గంటలకు చేరుకుటుంది. ఈ రైలుకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నాగపూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృత్యువాత

- రూ.2.50 లక్షల నష్టం

వేలేరు : మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండా గ్రామంలో కుక్కల దాడిలో గుగులోత్ చిరంజీవికి చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి కథనం ప్రకారం.. రోజుమాదిరిగానే గొర్రెల మందను తన వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. చిరంజీవి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా కొట్టం వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడగా మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా, గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హైనా దాడిలో దూడ..

తరిగొప్పుల: హైనా దాడిలో లేగదూడ మృత్యువాత పడింది. మండల కేంద్రానికి చెందిన పింగిళి యాదిరెడ్డి పశువుల పాకపై సోమవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి అందులో ఉన్న లేగదూడను హతమార్చింది. కాగా, కొద్ది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో హైనా దాడి చేసి దూడలను హతమారుస్తుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి హైనాను బంధించాలని కోరుతున్నారు.


గొర్రెల కళేబరాలు

రూ.200 కోట్లతో 'టెక్నికల్ హబ్'

- కార్యరూపం దాల్చనున్న మంత్రి సురేఖ కృషి
- తెలంగాణలో ఏకైక టెక్నికల్ సెంటర్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రూ.200 కోట్ల వ్యయంతో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా.. వాటిలో ఒక హబ్ ఖిలా వరంగల్ మండల పరిధి రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. మంత్రి కొండా సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. వరంగల్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో స్థాపించనున్న ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రధాన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి. టక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే హబ్ ఏర్పాటు ప్రకటనతో వరంగల్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు అభినందనలు తెలిపారు.

కేయూ పాలకమండలి సమావేశం



కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సమావేశాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల కేయూ రిజిస్ట్రార్, ఇతర పరిపాలనాపదవుల్లో పలువురు ప్రొఫెసర్లను నియమించిన విషయం తెలిసిందే. వీరికి సంబంధించిన ర్యాటిఫికేషన్‌ను ఈసమావేశంలో పెట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్, ఎంటెక్ పరీక్ష ఫలితాల విడుదల


పరీక్షల ఫలితాలు చూపిస్తున్న వివిధ శాఖాధిపతులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యూజీ 3, 5 పీజీ 3 సెమిస్టర్, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్. ఎం.ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్.వి.పురుషోత్తంరెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 9,69 మంది విద్యార్థు హాజరుకాగా.. 743 మంది, పీజీ 3వ సెమిస్టర్‌లో 234 మంది పరీక్షలకు హాజరుకాగా.. 203 మంది, బీటెక్, బీఫార్మసీ 3, 5వ సెమిస్టర్లలో 591 హాజరుకాగా 432 మంది, ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో హాజరైన ఆరుగురు విద్యార్థులు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్‌లో హాజరైన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఓఎస్‌డి. డా.వీరవెంకటయ్య, ఆచార్యులు జి.శంకర్‌లింగం, వి.మల్లికార్జున్, ఎస్.కవిత, ఎస్.సుమ, ఎం.జగదీశ్వర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురి మృతి చెందారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు, ఆటో, కారు ఢీకొన్న ఘటనలో మరో యువకుడు, రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



సాయిప్రసాద్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మెరుగు సాయిప్రసాద్ (24) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బలంగా చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుచ్చయ్య–కమల దంపతుల కుమారుడు సాయిప్రసాద్ గ్రామంలోనే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం కాజీపేట మండలం వనమాలకనపర్తిలో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే ముందు భార్య శ్రీవాణికి ఫోన్ చేశాడు. అర్ధరాత్రి అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి బుచ్చయ్య ఫోన్‌చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రోగ్రాంకు పిలిచిన వారికి ఫోన్ చేసి అడుగగా ఎప్పుడో వెళ్లాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులు వనమాల కనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం కనిపించింది. వెంటనే సాయిచంద్‌ను లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందించిన జిల్లా ఫొటోగ్రాఫర్లు

తోటి ఫొటోగ్రాఫర్ మృతి చెందిన విషయం తెలియగానే సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, కర్ణకంటి వెంకటేష్, చాగంటి మణి, కేరపాటి సాంబయ్య, అనిల్, సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కీర్తి ప్రవీణ్, సంతోష్, అన్వేష్, గంటె ఉపేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాసిరాజిగూడెం సమీపంలో వ్యక్తి..


జానీ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ముల్కలపల్లికి చెందిన ఎండీ జానీ(45) ఖమ్మం బైపాస్‌లో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కాసిరాజిగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జానీని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, కారు ఢీ.. యువకుడి దుర్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

కురవి: ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగిందని సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆటోను నడుపుకుంటూ మహబూబాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వెన్నం వెంకటేష్ కారును నడుపుకుంటూ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా సమీపంలోని రైస్‌మిల్లు వద్ద 365 జాతీయ రహదారిపై ఢీకొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోర్నకల్: గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన కోతుల వెంకన్న(60) పశువులను మేపేందుకు సోమవారం గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిలోమీటర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సిద్ధార్థ నగర్, ఫాతిమానగర్, బాబుక్యాంపు ప్రాంతాల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, ప్రశాంత్‌నగర్, రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

నేడు కుక్కల నియంత్రణపై సదస్సు

వరంగల్ అర్బన్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కుక్కల నియంత్రణ, వాటి దాడుల నుంచి తప్పించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బల్దియా సీఎంహెచ్‌ఓ రాజేష్ తెలిపారు. మంగళవారం ఉదయం ఎంజీఎం - ములుగు రోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్‌లో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, పశుసంవర్ధక శాఖ అధికారులు, నిపుణులు పాల్గొని కుక్కల దాడుల నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తారని తెలిపారు.

ఇటికాల అరుణకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం పరిశోధకురాలు ఇటికాల అరుణకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ ఇన్ హైదరాబాద్ స్టేట్ 1853 - 1948 అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి అరుణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ మనోహర్ పర్యవేక్షణలో అరుణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

'సలహాదారుడికి సన్మానం'




న్యూశాయంపేట: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అలీ షబ్బీర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ మెసా) నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు తెలంగాణ ఉమ్మడి జిల్లాల ఉర్దూ ఆఫీసర్స్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ.ఫారూఖ్ అహ్మద్ నేతృత్వంలో షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అఖిల్ అహ్మద్, షేక్ అజీముద్దీన్, ఇమ్రాన్, అస్మాసుల్తానా, సబానాజ్, అమతుల్ కరీమ్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమంలో అన్నదానం



హన్మకొండ: హనుమకొండ కేయూసీ - పెద్దమ్మగడ్డ రోడ్డులోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నదానం చేశారు. సోమవారం తన పుట్టిన రోజు వేడుకలను దివ్యాంగుల మధ్యన ఆశ్రమంలో జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వలస సారంగం, మొట్ల మనోహర్, ముత్తినేని రమేష్, రుకుముద్దీన్, సిరిమల్లె ప్రవీణ్, చిర్ర శ్రవణ్ పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



ఖిలా వరంగల్: జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో శివనగర్‌లోని వందన హైస్కూల్‌కు చెందిన నందిత ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఆడెపు శ్యామ్ తెలిపారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో నందితను సోమవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంభునిపేట ప్రభుత్వ హైస్కూల్ జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ పరీక్షను నిర్వహించగా, వివిధ పాఠశాలల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పదవ తరగతి విద్యార్థి నందిత ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి సాధించినట్లు వివరించారు. విద్యార్థిని అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ ఆడెపు విజయ శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ బోర్డ్ డైరెక్టర్‌గా నవీన్‌రెడ్డి



ఖిలా వరంగల్: వాకర్స్ ఇంటర్నేషనల్ 303 సెక్టార్‌లో 19 జిల్లాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని సోమవారం ఆయన అందుకున్నారు.

జాప్యమెందుకు?

- సర్కారు భూములను ఆక్రమించేందుకు కబ్జాదారుల యత్నం
- ఎస్సారెస్పీ భూముల్లో ఇసుక డంప్
- చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్న అధికారులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నమోదు కాని కేసు



ప్రభుత్వ భూముల్లో నిలిచిఉన్న వాహనాలు



ఎస్సారెస్పీ భూముల్లో ఇసుక లారీలు



ప్రభుత్వ స్థలంలో తాత్కాలిక నిర్మాణాలు

హసన్‌పర్తి: సర్కార్ భూములను ఆక్రమించేందు ఆ స్థలాల్లో ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేయడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంప్ బ్రిడ్జి వద్ద ఎస్సారెస్పీ భూమిని పదేళ్ల క్రితం ఓ వ్యాపారి ఆక్రమించాడు. ఆ భూమిలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి ఇసుక వ్యాపారానికి తెరలేపాడు.

చర్యలు శూన్యం

ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురవుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు నీటిపారుదల శాఖ అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారింది. అయితే, ఆ స్థలం కబ్జాకు గురికాకుండా ఉండేందుకు గతేడాది పోలీసులు ట్రంచ్ ఏర్పాటు చేశారు. కొంత కాలం పాటు ట్రంచ్ అలాగే ఉంది. ఆతర్వాత ట్రంచ్‌ను కబ్జాదారులు పూడ్చివేసి తమ పని తాము చేసుకుంటున్నారు.

పార్టీల అండతో..

ఎస్సారెస్పీ భూముల్లో ఇసుక డంప్ కొనసాగడానికి ముఖ్యంగా అప్పుడు గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణమని తెలుస్తోంది. అయితే ఇక్కడ సదరు ఇసుక దందా నిర్వాహకుడిపై ఆయా శాఖల అధికారులను చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది కార్పొరేషన్, నీటి పారుదలశాఖ అధికారులు కొలతలు కూడా తీశారు. కార్పొరేషన్ నుంచి నిధుల మంజూరుకు సిఫార్సు చేశారు. ఏడాదైనా నిధుల మంజూరు కాలేదు.

కబ్జాదారుడిపై ఫిర్యాదు

ఎస్సారెస్పీ భూముల్లో అక్రమంగా ఇసుక డంప్ ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నాడని ఆ వ్యక్తిపై నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఇసుక డంప్‌ను తొలగించే బాధ్యత కార్పొరేషన్‌దేనని పోలీసులు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

విద్యారణ్యపురి: టీచర్స్‌కాలనీ, రెవెన్యూకాలనీల తోపాటు పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. హనుమకొండలోని ప్రగతిమిత్ర టీచర్స్‌కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన 14కాలనీల అభివృద్ధి కమిటీల బాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రగతిమిత్ర టీచర్స్‌కాలనీ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కాలనీల సమస్యలను ఆయా అభివృద్ధి కమిటీల బాధ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రగతిమిత్ర టీచర్స్‌కాలనీ అభివృద్ధి కమిటీ బాధ్యులు పుల్లయ్య, రాజలింగం, నాగేశ్వర్‌రావు, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి

హన్మకొండ: వడ్డేపల్లిలో గత 15ఏళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని కాపు శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, కాంగ్రెస్ 58వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, 60వ డివిజన్ అధ్యక్షుడు అనుకోటి పున్నం, నాయకులు తాళ్లపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త, కార్మిక, రైతాంగ గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండలోని కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉప్పలయ్య, వెంకన్న, అశోక్, రవీందర్, లింగమూర్తి, యాకయ్య, ప్రభాకర్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె

వరంగల్ అర్బన్: ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె - గ్రామీణ భారత్ బంద్‌ను మున్సిపల్ కార్మికులు జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘాల నాయకులు సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 8న వరంగల్ డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న జిల్లా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏసీపీ భోజరాజు

ఖిలా వరంగల్: వాహనాదారులు ట్రాఫిక్ నిబంధలపై అవగాహన పెంచుకోవాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ ముక్కెర భోజరాజు సూచించారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు రుద్రమాంబ నగర్‌లోని టాలెంట్ హైస్కూల్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ బైక్ వెళ్లేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ముఖ్య కూడలిలో ప్రధానంగా సిగ్నల్ లైట్లను అనుసరిస్తూ ప్రయాణం చేయాలని చెప్పారు.

వనదేవతలను దర్శించుకున్న సీపీ



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. సీపీని ఆలయ సంప్రదాయాలతో పూజారులు గద్దెల పైకి ఆహ్వానించారు. అనంతరం ఆయనకు పూజారులు అమ్మవారి కండువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

వరంగల్ లీగల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా పట్టభద్రులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి సూచించారు. జిల్లా కోర్టులో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం సోమవారం ప్రచారం నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం



నయీంనగర్: హనుమకొండ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా పరకాల పట్టణానికి చెందిన ఎల్తూరి శ్రీనివాస్‌ను నియమిస్తూ బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైళ్లపై రాళ్లు రువ్వితే కఠిన చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కాశిబుగ్గ: రైళ్లపై రాళ్లు రువ్వితే బాధ్యులపై చర్యలు తప్పవని వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఎస్సై వెంకటేశ్వర్లు హెచ్చరించారు. వరంగల్ ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ సమీపంలోని లేబర్‌కాలనీలోని క్రిస్టియన్‌కాలనీ ప్రభుత్వ పాఠశాల, విజ్ఞాన్ ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రైళ్లపై రాళ్లు విసిరితే రైల్వే చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, జైలుశిక్ష సైతం పడుతుందని చెప్పారు. రైళ్లు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. రైలు పట్టాలు దాటే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన రైతు సంఘం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువస్తున్న మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆచార్య కూరపాటి వెంకటనారాయణ, కాసర్ల రాంరెడ్డి, సోమ రామమూర్తి, ఊరటి అంశాల రెడ్డి, మోకిడి పేరయ్య, ఎల్లయ్య బృందం వరంగల్ మార్కెట్‌లోని మిర్చి యార్డును సోమవారం సందర్శించి మిర్చి కొనుగోలు విషయంపై రైతులను విచారించింది. అనంతరం మార్కెట్ కార్యదర్శిని రైతు సంఘం నాయకులు కలిసి మిర్చి కొనుగోళ్లపై చర్చించారు. కాగా, మార్కెట్‌లో రైతు సంఘం నాయకులు ఉన్న సమయంలోనే భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చిలుపూరు గ్రామానికి చెందిన మహిళా రైతు చిర్ర రమణక్క.. శ్వాస ఇబ్బందితో అస్వస్థతకు గురయ్యారు. ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

మండలిలో నిరుద్యోగుల పక్షాన పోరాటం



మాట్లాడుతున్న అరూరి రమేష్

హసన్‌పర్తి: శాసన మండలిలో నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్‌కు గ్రాడ్యుయేట్లు అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు చేస్తున్న విష ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీంధర్‌నాథ్, వెంకటేశ్వర్ రెడ్డి, అటికం రవీందర్, రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, యూత్ అధ్యక్షుడు సాయి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అబాకస్‌లో నగర విద్యార్థుల ప్రతిభ



అబాకస్‌లో బహుమతులు అందుకుంటున్న నగర విద్యార్థులు

హన్మకొండ: అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీ పరీక్షలో వరంగల్, హనుమకొండకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. జనవరి 28న వర్చువల్‌గా నిర్వహించిన పరీక్ష ఫలితాలను ప్రకటించి, హైదరాబాద్‌లోని హర్యానా భవన్‌లో ఆదివారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈమేరకు నగరానికి చెందిన విద్యార్థులు 1నుంచి 6 లెవల్స్‌లో వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారని అలమా అబాకస్ జిల్లా ఫ్రాంచైజీ, అబాకస్ ఇన్‌స్ట్రక్టర్ పి.నరేష్ గుప్తా తెలిపారు. దేశ విదేశాల నుంచి 1500పైగా విద్యార్థులు 7నిమిషాలపాటు జరిగిన ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొని 1,20,000 సమ్స్ పూర్తి చేసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్రాంచైజర్ నరేష్ గుప్త, ఉపాధ్యాయులు శ్రీలేఖ, శిల్ప, సునీత పాల్గొన్నారు. అబాకస్ లెవల్ -2 జూనియర్ కేటగిరీలో విధీష్న అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకోవడంతో పాటు చాంపియన్ ట్రోఫీ గెలుచుకున్నారు. అలమా అబాకస్ డైరెక్టర్ ముత్తుకుమార్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజీవ్ శ్రీవాత్సవ్ బహుమతులు ప్రదానం చేశారు.

కొండేటి శ్రీధర్‌కు ఘన స్వాగతం



శ్రీధర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

మడికొండ: ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు మడికొండలో నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం మడికొండ నుంచి బైక్ ర్యాలీతో హనుమకొండకు బయలుదేరారు. కార్యక్రమంలో పానగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జన్ను మధు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్, వర్ధన్నపేట కన్వీనర్, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిండ్ల బాబురావు, 45వ డివిజన్ అధ్యక్షుడు చెన్నబోయిన శివ, నాయకులు గడ్డం మహేందర్, బైరపాక వెంకటేష్, ఎలగొండ శివ, రాజేందర్, దార ధనుంజయ్, అజయ్, ముత్తోజు సురేష్, రాణా, అరవింద్, అన్వేష్, నిఖిల్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ నాయకులు



వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్: సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ గ్రీవెన్స్‌లో పలువురు సోమవారం ఫిర్యాదు చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని (పలివేల్పుల, కుమార్‌పెల్లి, లష్కర్‌సింగారం) శివారుల్లోని భూములు కొన్నేళ్లుగా కబ్జాకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చర్య తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ కేయూ అధ్యక్షుడు మహ్మద్‌పాషా కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తాకు సోమవారం ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీలో భూముల్లో అక్రమంగా నిర్మించిన 13ఇళ్లు ఉన్నట్లు గతంలో గుర్తించారని పేర్కొన్నారు.

అనుమతి లేని అకాడమీని మూసివేయాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని నక్కలగుట్టలోని అనుమతి లేకుండా నడుస్తున్న ఓ అకాడమీని మూసివేయాలని అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య (ఏబీఎస్ఎఫ్), బహుజన విద్యార్థి ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద ప్రమీల నరేష్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అకాడమీని నడుపుతున్నారని, ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆ అకాడమీపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు ఉదయ్, శ్రీనాథ్, పృథ్వీరాజ్, యాకూబ్, అనిల్ యాదవ్, మహేష్‌కుమార్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ భూములను రక్షించండి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని (పలివేల్పుల, కుమార్‌పెల్లి, లష్కర్‌సింగారం) శివారుల్లోని భూములు కొన్నేళ్లుగా కబ్జాకు గురవుతున్నాయని, వారిటి రక్షించి కబ్జాదారులపై చర్య తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ కేయూ అధ్యక్షుడు మహ్మద్‌పాషా కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తాకు సోమవారం ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీలో భూముల్లో అక్రమంగా నిర్మించిన 13ఇళ్లు ఉన్నట్లు గతంలో గుర్తించారని పేర్కొన్నారు.

ఆ వైద్యులపై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కొందరు ప్రభుత్వ వైద్యులు.. అక్కడ పనిచేయకుండా ప్రైవేటుగా వైద్యం నిర్వహిస్తున్నారని, అలాంటి వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు వైద్యం నిర్వహించకూడదని గతంలోనే ప్రభుత్వం జీఓ 119/2006ను విడుదల చేసిందని గుర్తుచేశారు. వారు పనిచేసే చోట ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉండాలని 2022వ సంవత్సరంలో డీఎంహెచ్‌ఓ సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. కాగా, జీఓలను అమలు చేయకుండా ధనార్జనే ధ్యేయంగా కొంతమంది ప్రభుత్వ వైద్యులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, ఉపాధ్యక్షులు మంద సుచందర్, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే టెస్టులు



టాలెంట్ పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నరేష్‌చంద్ర, తదితరులు

హన్మకొండ: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని ఆర్యభట్ట విద్యాసంస్థల చైర్మన్ నరేష్‌చంద్ర అన్నారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు హనుమకొండ నక్కలగుట్టలోని ఆర్యభట్ట స్కూల్‌లో రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యభట్ట విద్యాసంస్థల చైర్మన్ నరేష్‌చంద్ర మాట్లాడుతూ ఈ పరీక్షతో 10వ తరగతి ప్రధాన పరీక్షపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. పరీక్షలంటే భయాన్ని పోతుందని, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో అవగతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి నాయకులు విజయ్, అరవింద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను బలపర్చండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బక్క జడ్సన్

కేయూ క్యాంపస్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను బలపర్చాలని కాంగ్రెస్ నేత, ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఏకశిలపార్కు, పబ్లిక్‌గార్డెన్లలో వాకర్స్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.